సమగ్ర తెలుగు దినపత్రిక

Website: www.adugunews.com

# అడుగు

The Step Towards The Truth..

హైదరాబాద్ | ఆదివారం 22 మార్చి 2026 | సంపుటి: 02 | సంచిక: 36 | పేజీలు: 4 | వెల: రూ.6:50

Published from Telangana, Andhra Pradesh | చీఫ్ ఎడిటర్: డాక్టర్ మార్గం లక్ష్మీనారాయణ | Mail: adugudaily@gmail.com


## అతిపెద్ద చౌరబాటుదారు మోదీయే

**ఈద్ ర్యాలీలో మమత బెనర్జీ వ్యాఖ్యలు**

కోల్‌కతా,మార్చి21(అడుగు న్యూస్): దేశంలో అతిపెద్ద చౌరబాటుదారుడు ప్రధాని మోదీయే అని విమర్శించారు పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ. బెంగాల్ రాజధాని కోల్‌కతాలోని రెడ్ రోడ్‌లో శనివారం జరిగిన ఈద్ ర్యాలీలో మమత పాల్గొన్నారు. అనంతరం జరిగిన

మిగతా 3లో..

## ఎమ్మెల్యే దానంపై హై కోర్టుకు బీజేపీ

**స్పీకర్ తీర్పును సవాల్ చేస్తూ ఏలేటి పిటిషన్**

హైదరాబాద్,మార్చి21(అడుగు న్యూస్): తెలంగాణ రాజకీయాల్లో పార్టీ ఫిరాయింపుల అంశం మరోసారి న్యాయస్థానం చేరింది. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు సంబంధించి అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఇటీవల ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దానం నాగేందర్ పార్టీ మారలేదని

మిగతా 3లో..

# ముగిస్తం..! తెగిస్తం!!

# ఇరాన్, ఇజ్రాయెల్ చెరో మాట!

## ఫ్లాష్.. ఫ్లాష్...ఫ్లాష్

### 48 గంటల డెడ్ లైన్!

**హర్మూజ్ తెరవాల్సిందే**

**ఇరాన్ కు ట్రంప్ అల్టిమేటం**

వాషింగ్టన్, మార్చి 21 (అడుగు న్యూస్): అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌పై కఠిన హెచ్చరికలు జారీ చేశారు. ప్రపంచ చమురు రవాణాకు కీలకమైన హార్మూజ్ ను 48 గంటల్లోగా తిరిగి తెరవాలని అల్టిమేటం ఇచ్చారు. ఈ మేరకు ట్రంప్ తన ట్రూత్ సోషల్ వేదికగా స్పందిస్తూ, గడువులోగా మార్గాన్ని పూర్తిగా తెరవకపోతే ఇరాన్‌లోని విద్యుత్ కేంద్రాలపై దాడులు చేపడతామని హెచ్చరించారు. ముఖ్యంగా అతిపెద్ద విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని మొదట లక్ష్యంగా చేసుకునే అవకాశం ఉందని స్పష్టం చేశారు.

- నతాంజ్ అణుశుద్ధి కేంద్రంపై దాడులు?
- డిగో గార్సియాపైకి ఇరాన్ క్షిపణులు!
- 4 వేల కి.మీ. లక్ష్యాన్ని ఛేదించిన ఇరాన్
- అమెరికా, బ్రిటన్ స్థావరంపై ఇరాన్ దాడులు
- ఇజ్రాయెల్ ఎఫ్-16ను కూల్చేశాం: ఐఆర్జీసీ
- దాడి జరిగినా, విమానం కూలలే : ఇజ్రాయెల్
- హర్మూజ్ పై ఇరాన్ పట్టు తగ్గింది : అమెరికా
- ఇరాన్ చమురుపై ఆంక్షలు ఎత్తేసిన అమెరికా
- హర్మూజ్ ను తెరవాలని 22 దేశాల వినతి



టెహ్రాన్,మార్చి21(అడుగు న్యూస్): రోజురోజుకూ ఇరాన్ యుద్ధం తీవ్రరూపం దాల్చుతోంది. ఈ క్రమంలోనే హిందూ మహాసముద్రం పైకి ఇరాన్ రెండు బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించింది. ఇలా ఇరాన్ తన దాడులను తీవ్రతరం చేసినట్టు తెలుస్తోంది. ఏకంగా 4 వేల కిలో మీటర్ల దూరంలోని యూఎస్, యూకేల సంయుక్త సైనిక స్థావరమే లక్ష్యంగా రెండు బాలిస్టిక్ క్షిపణుల ను ప్రయోగించినట్టు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. హిందూ మహాసముద్రంలోని డియేగో గార్సియా దీవిలోగల సైనిక స్థావరంపై ఇరాన్ ఈ మిసైల్స్‌ను ప్రయోగించిందని సమాచారం. చాగోస్ ద్వీపసముదాయంలో ఇదొక భాగం. మీడియా కథనాల ప్రకారం, ఇరాన్ ప్రయోగించిన తొలి మిసైల్ మార్గమధ్యంలోనే విఫలమైంది. మరో మిసైల్‌పై ఒక అమెరికా యుద్ధ నౌక క్షిపణి విధ్వంసక రాకెట్‌ను ప్రయోగించింది. ఈ దాడిలో రెండో మిసైల్ ధ్వంసమైందా? లేదా? అనేది ఇంకా తెలియాల్సి ఉంది. ఈ వార్తలపై అమెరికా ఇంకా స్పందించ లేదు. ఇప్పటివరకూ

మిగతా 2లో..

## ద్రవ్యోల్బణంతో జాగ్రత్త!

- ఆర్థిక వ్యవస్థపై యుద్ధ ప్రభావం
- రూపాయి విలువ మరింత పతనం
- ప్రధాని మోదీకి ప్రతిపక్ష నేత రాహుల్ హెచ్చరిక

న్యూఢిల్లీ,మార్చి21(అడుగు న్యూస్): పశ్చిమాసియాలో యుద్ధం నేపథ్యంలో దేశీయ ఆర్థిక వ్యవస్థపై దాని ప్రభావం తీవ్రంగా ఉంటుందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ హెచ్చరించారు. రూపాయి విలువ పతనం, ఇంధనం ధరలు పెరగడం రాబోయే ద్రవ్యోల్బణ సునామీకి సంకేతాలని అన్నారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ఆయన ఒక పోస్ట్ పెట్టారు. 'డాలర్‌తో పోల్చిస్తే రూపాయి విలువ ఆల్ టైమ్ కనిష్టానికి పడిపోయింది. త్వరలోనే అది 100 మార్క్‌ను తాకవచ్చు. పారిశ్రామిక ఇంధనం ధరల్లో స్వల్ప పెరుగుదల చోటుచేసుకుంది. ఇవి కేవలం గణాంకాలు కావు. ద్రవ్యోల్బణం పెరగబోతోందనడానికి సంకేతాలు' అని రాహుల్ ఆ ట్వీట్‌లో పేర్కొన్నారు.

మిగతా 2లో..

## యుద్ధాన్ని ఆపండి : మోదీకి ఇరాన్ మొర

ఇరాన్ అధ్యక్షుడికి ఫోన్ చేసిన భారత ప్రధాని

న్యూఢిల్లీ,మార్చి21(అడుగు న్యూస్): ప్రధాని నరేంద్ర మోడీ శనివారం ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్‌కు ఈద్, నౌరూజ్ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండుగ కాలం పశ్చిమ ఆసియాకు శాంతి, స్థిరత్వం, శ్రేయస్సును తీసుకువస్తుందని ఆశాభావం మోడీ వ్యక్తం చేశారు. ఇరాన్ నాయకుడితో జరిపిన ఫోన్ సంభాషణలో మోడీ ఇరాన్‌లో కీలక మౌలిక సదుపాయాలపై జరిగిన దాడులను ఖండించారు. ఈ దాడులు ప్రాంతీయ స్థిరత్వానికి

మిగతా 2లో..



**రూ.300 కోట్లు.. 3 దశలు**

**భద్రాచల రాముడి గుడి అభివృద్ధి మంత్రులతో మాస్టర్ ప్లాన్ ను సమీక్షించిన సీఎం**

3లో



# నేడే రైతు ఖాతాల్లోకి భరోసా నిధులు

సీఎం చేతుల మీదుగా నర్మెట్ట ఆయిల్ పామ్ ప్రారంభం

సిద్దిపేట,మార్చి21(అడుగు న్యూస్): సిద్దిపేట జిల్లాలోని నర్మెట్ట వద్ద నిర్మించిన ఆధునిక ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ ఫ్యాక్టరీ ప్రారంభం తెలంగాణ వ్యవసాయ రంగంలో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలవబోతోంది. సుమారు రూ.300 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ ఫ్యాక్టరీ రాష్ట్రంలో ఆయిల్ పామ్ సాగుకు కొత్త ఊపును ఇవ్వనుంది. మార్చి 22న ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఈ ఫ్యాక్టరీ ప్రారంభం కానుంది. అదే రోజు రాష్ట్ర రైతులకు రైతు భరోసా నిధుల విడుదల కూడా జరగనుంది. ఈ రెండు కార్యక్రమాలు ఒకే వేదికపై జరగడం తెలంగాణ రైతాంగానికి శుభసూచకంగా భావించాలి. ఈ సందర్భంగా నర్మెటలో భారీ ఏర్పాట్లు చేశారు. సిఎం రేవంత్ రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల, పొన్నం తదితరులు పాల్గొంటారు. పోలీసులు భారీగా బందోబస్తు ఏర్పాటు చేశారు. రైతులకు దీర్ఘకాలిక ఆదాయం కల్పించే

మిగతా 3లో..

# తగ్గేదేలే..

- జీవన్ రెడ్డి అటో ఇటో తేలేది నేడే
- మంత్రుల మధ్యవర్తిత్వం విఫలం



జగిత్యాల,మార్చి21(అడుగు న్యూస్): పార్టీ మారతానన్న కాంగ్రెస్ సీనియర్ నేత జీవన్‌రెడ్డిని బుజ్జగించే ప్రయత్నాలు మొదలయ్యాయి. ఆయనతో మంత్రులు శ్రీధర్ బాబు, లక్ష్మణ్, ఎమ్మెల్యే సత్యం భేటీ అయ్యారు. గంటకుపైగా సమావేశమయ్యారు. పార్టీలో గౌరవం దక్కడం లేదని ఈ సందర్భంగా మంత్రుల ముందు జీవన్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. అయితే సమస్య ఉంటే అధిష్టానంతో మాట్లాడుదామని, పార్టీ మారే ఆలోచన మంచిది కాదని సూచించారు. దీనికి జీవన్ రెడ్డి పెద్దగా స్పందించలేదు. ఈ భేటీ అనంతరం

మిగతా 3లో..

## అసెంబ్లీలో ప్రైవేట్ బిల్లు

**ఆరు గ్యారెంటీలకు చట్టబద్ధతే లక్ష్యం : కేటీఆర్**

హైదరాబాద్,మార్చి21(అడుగు న్యూస్): ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కోసం అసెంబ్లీలో ప్రైవేట్ మెంబర్ బిల్లు పెడతామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు వెల్లడించారు. ఈ విషయంలో అసెంబ్లీ స్పీకర్, శాసనమండలి చైర్మన్‌ను కలుస్తామని తెలిపారు. ఆరు గ్యారెంటీల్లో అర గ్యారెంటీ కూడా అమలు కాలేదన్నారు. అందుకే ఈ నిర్ణయం తీసుకున్నామని అన్నారు. శనివారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. ఆరు గ్యారంటీల బిల్లుకు మద్దతు కోసం

మిగతా 2లో..

## భార్య మరణం.. భర్త బలవన్మరణం

**కరీంనగర్ టూటౌన్ ఎస్సై కుటుంబంలో విషాదం**

కరీంనగర్,మార్చి21(అడుగు న్యూస్): కరీంనగర్ టూటౌన్ ఎస్సై చంద్రశేఖర్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ నెల 18వ తేదీన చంద్రశేఖర్ భార్య దివ్య ఆత్మహత్యకు పాల్పడింది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన చంద్రశేఖర్.. ఇల్లంతకుంట మండలం సీతంపేటలోని అత్తగారింట్లో ఉరివేసుకున్నాడు.

మిగతా 2లో..

## ఆర్థిక నియంత్రణ, క్రమశిక్షణే అసలైన సవాళ్ళు!?

ప్రస్తుత బడ్జెట్‌లో సంక్షేమం--అభివృద్ధి మధ్య బ్యాలెన్స్ తప్పినట్లు కనిపిస్తోంది. రుణాలపై అధికంగా ఆధారపడటం, ఆదాయ అంచనాల్లో అనిశ్చితి, వ్యయ నియంత్రణలో నిర్లక్ష్యం వంటి అంశాలు దీర్ఘకాలిక ఆర్థిక ఆరోగ్యానికి సవాళ్ళుగా మారవచ్చు. ఉచిత పథకాలతో పాటు ఆదాయం పెంపు, వృథా ఖర్చుల నియంత్రణ, సమర్థవంతమైన ఆర్థిక ప్రణాళిక ఇవే రాష్ట్రాన్ని స్థిరమైన అభివృద్ధి దిశగా నడిపించగలవు. లేదంటే, సంఖ్యల్లో ఘనంగా కనిపించే బడ్జెట్‌లు వాస్తవంలో భారంగా మారే ప్రమాదం లేకపోలేదు!

**డా. మార్గం-అడుగు**

ఎడిటోరియల్ 2వ పేజీలో

## శ్రమ మాది.. శిలాఫలకాలు మీవా?

**నర్మెట ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ ప్రారంభంపై హరీశ్ రావు**

సిద్దిపేట,మార్చి21(అడుగు న్యూస్): సిద్దిపేట నియోజకవర్గానికి చేసిన ద్రోహం, నిధుల రద్దుపై ముఖ్యమంత్రి వివరణ ఇవ్వాలని స్తానిక ఎమ్మెల్యే హరీశ్ రావు డిమాండ్ చేశారు. రేవంత్ ప్రారంభించబోయే అభివృద్ధి పనుల్లో ఏ ఒక్కటీ కాంగ్రెస్ ఇచ్చిందని లేదని..

మిగతా 2లో..

## డ్రగ్స్ కేసులో సిట్ దూకుడు

- పోలీసుల అదుపులో అభిషేక్
- మొయినాబాద్ ఫాంహౌస్ సీజ్
- ఆ ఫాంహౌస్ కు24 సార్లు డ్రగ్స్ సరఫరా
- అసైన్డ్ భూమిలో రోహిత్ రెడ్డి ఫాంహౌస్
- రెవెన్యూ విచారణలో బాగోతం బట్టబయలు

రంగారెడ్డి,మార్చి21(అడుగు న్యూస్): తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన మొయినాబాద్ డ్రగ్స్ కేసులో సిట్ దూకుడు పెంచింది. ఈ కేసు తాజాగా కీలక మలుపు తిరిగింది. డ్రగ్ పెడ్లర్, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అభిషేక్ సింగ్‌ను సిట్ బృందం అదుపులోకి తీసుకుంది. నిందితుల్లో ఒక్కరైన కౌశిక్ రవి ఇచ్చిన సమాచారంతో నాలుగు బృందాలుగా ఏర్పడిన సిట్ ఎట్టకేలకు అతణ్ని పట్టుకుంది. హైదరాబాద్‌లోనే అభిషేక్ సింగ్‌ను అదుపులోకి తీసుకోవడం గమనార్హం. బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి ఫామ్ హౌస్ పార్టీకి అభిషేక్ సింగ్ డ్రగ్స్ సప్లై చేశాడు. హైదరాబాద్ క్షఖీఖీ వద్ద అభిషేక్ సింగ్ నుంచి రోహిత్ డ్రైవర్ శరత్ డ్రగ్స్ కొనుగోలు చేశాడు. అనంతరం పార్టీలో

మిగతా 2లో..

సమగ్ర తెలుగు దినపత్రిక
అడుగు
The Step Towords The Truth..

## సంపాదకీయం
## మార్గం - అడుగు



### ఆర్థిక నియంత్రణ, క్రమశిక్షణే అసలైన సవాళ్ళు!?

తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ రూ.3,24,234 కోట్లు! అందులో సంక్షేమానికి రూ. 1,45,591 కోట్లు. ఈ కేటాయింపు లెక్కలు ఓ ప్రశ్నను సంధిస్తున్నాయి. సంక్షేమం పేరుతో పెరుగుతున్న ఈ ఖర్చులు రాష్ట్రాన్ని రుణభారం నుంచి విముక్తి చేస్తున్నాయా, లేక మరింత అప్పుల ఊబిలో పడేస్తున్నాయా? ఈ నేపథ్యంలో ప్రస్తుత బడ్జెట్ ను కూలంకశంగా పరిశీలిస్తే, అభివృద్ధి కంటే వ్యయం అధికంగా, ఆర్థిక క్రమశిక్షణ తక్కువగా ఉన్నట్లు కనిపిస్తున్నదన్న విమర్శలకు బలం చేకూరుస్తున్నది.

రెండున్నరేళ్లుగా కొనసాగుతున్న ప్రస్తుత కాంగ్రెస్ పార్టీ పాలనలో, రుణాల నియంత్రణపై స్పష్టమైన దృష్టి కనబడడం లేదన్నది ప్రధాన అభ్యంతరం. గత ఆర్థిక సంవత్సరంలో బహిరంగ మార్కెట్ నుంచి రూ.64,539 కోట్లు రుణాలు సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్న ప్రభుత్వం, వాస్తవానికి రూ.67,539 కోట్లు సమీకరించింది. ఇది అంచనాలకన్నా ఎక్కువగా అప్పులు తీసుకున్నట్టు స్పష్టం చేస్తోంది. ఇక రాబోయే ఆర్థిక సంవత్సరానికి రూ.73,383 కోట్లు బహిరంగ మార్కెట్ నుంచి, మిగతాతో కలిపి మొత్తం రూ.82,870 కోట్లు కొత్త రుణాలు సేకరించాలని లక్ష్యంగా పెట్టుకోవడం ఆర్థిక భారం మరింత పెరిగే సూచనగా కనిపిస్తోంది.

ఇక ఆదాయ అంచనాల విషయానికి వస్తే, ప్రభుత్వం అదనంగా రూ.43 వేల కోట్లు సమీకరించగలమని భావిస్తోంది. ఇందులో పన్నుల ద్వారా రూ.14 వేల కోట్లు, కేంద్ర గ్రాంట్ల రూపంలో రూ.13 వేల కోట్లు, పన్నేతర ఆదాయంగా రూ.6,412 కోట్లు, కేంద్ర పన్నుల్లో రాష్ట్ర వాటాగా రూ.3,710 కోట్లు, కొత్త రుణాల రూపంలో రూ.5,325 కోట్లు రావచ్చని అంచనా వేసింది. అయితే ఈ అంచనాలు ఎంతవరకు వాస్తవం అవుతాయన్నది సందేహాస్పదం. గత బడ్జెట్‌లో కేంద్ర గ్రాంట్లుగా రూ.22,782.50 కోట్లు వస్తాయని భావించినా, వాస్తవంగా రూ.11,161 కోట్లు మాత్రమే లభించాయి. ఈ అనుభవం దృష్ట్యా, తాజా అంచనాలపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

వాస్తవానికి రాష్ట్ర ఆదాయంలో పెద్ద భాగం ఉద్యోగుల జీతాలు, పెన్షన్లు, అప్పులపై వడ్డీలు, కిస్తీల చెల్లింపులకే వెచ్చించబడుతోంది. దీంతో సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు అవసరమైన నిధులు ప్రధానంగా కొత్త రుణాలపై ఆధారపడుతున్నాయి. ఇది దీర్ఘకాలికంగా ఆర్థిక స్థిరత్వానికి ముప్పుగా మారే అవకాశముంది.

ప్రస్తుత బడ్జెట్‌లో సంక్షేమ పథకాలకే అధిక ప్రాధాన్యత ఇవ్వడం గమనార్హం. పేదల అభ్యున్నతికి సంక్షేమం అవసరమే అయినా, వృథా ఖర్చులను నియంత్రించాల్సిందిపోయి, వాటినే కొనసాగించడం ఆందోళనకరం. డబుల్ పెన్షన్లు, అధిక వేతనాలు, సబ్సిడీల రూపంలో భారీగా ఖర్చులు పెరుగుతున్నాయి. బోగస్ రేషన్ కార్డులను తొలగించడం వంటి చర్యలు తీసుకుంటే ఖర్చులు గణనీయంగా తగ్గే అవకాశం ఉంది. కానీ, ఆ సాహసం ఈ ప్రభుత్వమే కాదు, మరే ప్రభుత్వం చేయడానికి సాహసించడంలేదు. ఇది ఓట్ల రాజకీయం. దానికి ఏ పార్టీ, ఏ ప్రభుత్వమూ మినహాయింపు కాదు.

అభివృద్ధిలో పరిస్థితి ఆశాజనకంగా, ఆశించినంతగా లేదు. రోడ్ల దుస్థితి, ప్రభుత్వ వైద్యశాలలపై నిర్లక్ష్యం, హాస్టళ్లలో అసౌకర్యాలు, అధిక ధరలు, నిరుద్యోగం, రైతుల సమస్యలు ప్రజల నిత్యజీవితంపై ప్రత్యక్ష ప్రభావం చూపుతున్న అంశాలు. ఉన్న పాఠశాలలను మెరుగుపరచకుండా, కొత్తగా 'ఇంటగ్రేటెడ్ స్కూళ్ల' కోసం రూ.5 వేల కోట్లు కేటాయించడం ప్రాధాన్యతలపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. విద్యా వసతులు అత్యంత బలహీనంగా ఉన్నప్పుడు, మరో అధునాతన విద్యా ప్రాజెక్టులకు భారీ నిధులు కేటాయించడం సమంజసం కాదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఇక గ్రామీణాభివృద్ధి, స్వయం సమృద్ధి వంటి అంశాలు కూడా బడ్జెట్‌లో తగిన ప్రాధాన్యత పొందలేదన్న విమర్శ ఉంది. దేవాదాయ భూముల పరిరక్షణ, స్థానిక మౌలిక వసతుల అభివృద్ధి వంటి అంశాల్లో ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ చూపించాల్సిన అవసరం ఉంది.

మరోవైపు, రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన కొన్ని పథకాలు ఆశాజనకంగా కనిపిస్తున్నాయి. ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల ప్రమాద బీమా, ఆరోగ్య సేవల విస్తరణ వంటి చర్యలు సానుకూలమే. అయితే ఈ పథకాల అమలులో స్పష్టత, పారదర్శకత అవసరం. ఎవరు లబ్ధిదారులు? అమలు విధానం ఎలా ఉంటుంది? అనే ప్రశ్నలకు సమాధానాలు అవసరం.

మొత్తానికి, ప్రస్తుత బడ్జెట్‌లో సంక్షేమం--అభివృద్ధి మధ్య బ్యాలెన్స్ తప్పినట్లు కనిపిస్తోంది. రుణాలపై అధికంగా ఆధారపడటం, ఆదాయ అంచనాల్లో అనిశ్చితి, వ్యయ నియంత్రణలో నిర్లక్ష్యం వంటి అంశాలు దీర్ఘకాలిక ఆర్థిక ఆరోగ్యానికి సవాళ్ళుగా మారవచ్చు. ఉచిత పథకాలతో పాటు ఆదాయం పెంపు, వృథా ఖర్చుల నియంత్రణ, సమర్థవంతమైన ఆర్థిక ప్రణాళిక ఇవే రాష్ట్రాన్ని స్థిరమైన అభివృద్ధి దిశగా నడిపించగలవు. లేదంటే, సంఖ్యల్లో ఘనంగా కనిపించే బడ్జెట్‌లు వాస్తవంలో భారంగా మారే ప్రమాదం లేకపోలేదు.

# ముగిస్తం..! తెగిస్తం!!

మొదటిపేజీ తరువాయి..

ఇరాన్ మిసైల్ దాడులు పశ్చిమాసియాకే పరిమితమయ్యాయి. తాజాగా హిందూ మహాసముద్రంలోని దీవిని ఇరాన్ టా÷-గ్గ÷ట్ చేసిందన్న వార్తలు కలకలం రేపుతున్నాయి. ఇదే నిజమైతే ఐరోపా ఖండంలోని పలు యూఎస్ సైనిక స్థావరాలు ఇరాన్ దాడుల పరిధిలోకి వచ్చినట్టు అవుతుందని విశ్లేషకులు కామెంట్ చేస్తున్నారు. ఇటీవల శ్రీలంకకు దక్షిణాన హిందూ మహాసముద్ర జలాల్లో ఒక ఇరాన్ యుద్ధ నౌకను అమెరికా సబ్‌మెరైన్ ధ్వంసం చేసిన విషయం తెలిసిందే. టార్పిడో ప్రయోగంతో తీవ్రంగా దెబ్బతిన్న ఇరాన్ నౌక నీట మునిగిపోయింది. ఈ ఘటనలో సుమారు 85 మంది మరణించారు. భారత్‌లో జరిగిన మిలన్-2026 నావికాదళ విన్యాసాల్లో పాల్గొన్న ఇరాన్ నౌక తిరిగి వెళుతున్న సమయంలో అమెరికా దాడి చేసింది. ఇరాన్ నావికా దళాన్ని నిర్వీర్యం చేయడం తమ ప్రాథమిక లక్ష్యాల్లో ఒకటని అమెరికా అప్పట్లో పేర్కొంది. అయితే ఈ క్షిపణులను ఎప్పుడు ప్రయోగించారన్న దానిపై స్పష్టత లేదు. డిగో గార్సియా హిందూ మహాసముద్రంలో యూఎస్-యూకేకు ఉన్న వ్యూహాత్మక సైనిక స్థావరం. హిందూ మహాసముద్రంలో 60 దీవుల సముదాయం చాగోస్. అందులో అతిపెద్దదే డిగో గార్సియా. ఆఫ్రికా, పశ్చిమాసియాలోని కార్యకలాపాల కోసం అమెరికా దీనిని ప్రధానంగా వినియోగిస్తోంది. ఇదిలాఉంటే.. హర్మూజ్ జలసంధిని తెరిపించేందుకు, ఇరాన్‌కు చెందిన ఖర్గ్ ఐలాండ్‌ను ఆక్రమించే అవకాశాలను అమెరికా పరిశీలిస్తోందని వార్తలు వస్తున్నాయి. ఆ క్రమంలోనే పశ్చిమాసియాలో మరో మూడు యుద్ధనౌకలను మోహరించేందుకు అమెరికా సిద్ధమైంది. యూఎస్ఎస్ బాక్సర్, మరో రెండు యుద్ధనౌకలు దాదాపు 2,500 మంది నౌకాదళ సిబ్బందితో పశ్చిమాసియా దిశగా వెళ్తున్నట్లు అమెరికా అధికారి ఒకరు శుక్రవారం వెల్లడించిన సంగతి తెలిసిందే. అగ్రరాజ్యానికి చెందిన యాంఫిబియస్ అసాల్ట్ షిప్ యూఎస్ఎస్ ట్రిపోలీ పశ్చిమాసియా వైపు కదులుతున్నట్లు తెలుస్తోంది. ఈ పరిణామాల వేళ..ఈ క్షిపణుల ప్రయోగం గురించి వెలుగులోకి వచ్చింది. తమవద్ద క్షిపణుల పరిధి 2000 కి.మీ. వరకు ఉంటుందని ఇటీవల ఇరాన్ విదేశాంగ మంత్రి వెల్లడించారు. కానీ చెప్పిన దానికంటే ఇరాన్ వద్ద ఉన్న మిస్సైళ్ల పరిధి చాలా ఎక్కువే ఉండొచ్చని తాజా ఘటన వెల్లడి చేస్తోంది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలకు అడ్డుకట్ట పడటం లేదు. తమ భూభాగంపై దాడికి దిగిన ఇజ్రాయెల్ యుద్ధ విమానాన్ని కూల్చేసినట్టు ఇరాన్ మిలిటరీ శనివారంనాడు ప్రకటించింది. దీనికి ఒకరోజు ముందే అమెరికా ఎఫ్-35 స్టెల్త్ యుద్ధ విమానాన్ని ఢీ కొట్టామని ఇరాన్ ప్రకటించుకుంది. ఇజ్రాయెల్ యుద్ధవిమానంపై దాడి జరిగినట్టు



ఇజ్రాయెల్ కూడా గుర్తించిందని 'టెహ్రాన్ టైమ్స్' తెలిపింది. తమ యుద్ధవిమానాన్ని టా÷-గ్గ÷ట్ చేస్తూ ఉపరితలం నుంచి గగనతలంపైకి క్షిపణిని ప్రయోగించారని ఇజ్రాయల్ మిలిటరీ పేర్కొంది. ఏ తరహా యుద్ధ విమానం అనేది మాత్రం వెల్లడించలేదు. కాగా, ఇరాన్ గగనతలంపై ఇజ్రాయెల్ విమానంపై క్షిపణి ప్రయోగం జరిగిందని, అయితే విమాన సిబ్బంది ప్రామాణిక విధానాలను అనుసరించడం ద్వారా ముప్పును తప్పించారని, ఎలాంటి నష్టం లేకుండా మిషన్‌ను పూర్తి చేశారని 'ది టైమ్స్ ఆఫ్ ఇజ్రాయెల్' పేర్కొంది. ఇరాన్ క్షిపణి అతి సమీపానికి రావడంతో పైలట్ వృత్తిపరమైన నైపుణ్యంతో అత్యంత వేగంగా స్పందించి దాడిని తప్పించినట్టు ఆ కథనం పేర్కొంది. విమానానికి నష్టం జరిగినట్టు ఎలాంటి సమాచారం లేదు. కాగా, ఇరాన్‌లోని నతాంజ్ అణుశుద్ధి కేంద్రంపై ఇటీవల దాడులు జరిపిన అమెరికా-ఇజ్రాయెల్ దళాలు శనివారంనాడు మరోసారి విరుచుకుపడ్డాయి. ఈ దాడుల్లో ఎలాంటి రేడియోధార్మిక పదార్థాలు లీక్ అవ్వలేదని, పరిసర ప్రాంత నివాసితులకు ప్రమాదం వాటిల్లలేదని వార్తా సంస్థలు తెలిపాయి. ఈ దాడిని ఇరాన్ తీవ్రంగా ఖండించింది.

ఇజ్రాయెల్ నేరపూరిత చర్యల్లో భాగంగానే ఈదాడి జరిపిందని, అణుభద్రతా నిబంధనలు, అంతర్జాతీయ చట్టాలకు తూట్లు పొడిచిందని నిప్పులు చెరిగింది. తాజాగా ఇరాన్‌లోని నతాంజ్ అణు శుద్ధి కేంద్రంపై అమెరికా, ఇజ్రాయెల్ మరోసారి దాడులకు పాల్పడినట్టు స్థానిక మీడియా సంస్థ తస్నిమ్ తెలిపింది. యుద్ధం ప్రారంభమైన తర్వాత నతాంజ్ అణు క్షేత్రంపై దాడులు చేయడం ఇది రెండోసారి. నతాంజ్ అణు క్షేత్రంపై అమెరికా, ఇజ్రాయెల్ వైమానిక దాడులకు పాల్పడ్డాయని, అయితే రేడియోధార్మిక పదార్థాల లీకేజీ జరగలేదని, పరిసర ప్రాంతాల ప్రజలకు ఎలాంటి సమస్యా లేదని తెలిపింది నతాంజ్ క్షేత్రంపై ఇజ్రాయెల్, అమెరికా దాడులను ఇరాన్ తీవ్రంగా ఖండించింది. అమెరికా, ఇజ్రాయెల్ అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక ఒప్పందం, ఇతర అణు భద్రత నిబంధనలు, అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించాయని పేర్కొంది. నేరపూరిత చర్యల్లో భాగంగానే నతాంజ్ అణు కేంద్రంపై ఇజ్రాయెల్, అమెరికా దాడులు చేశాయని ఆగ్రహం వ్యక్తం చేసింది. యుద్ధం ప్రారంభమైన మొదటి వారంలోనే నతాంజ్ అణు కేంద్రంపై అమెరికా, ఇజ్రాయెల్ దాడులకు దిగిన సంగతి తెలిసిందే .తాము జరిపిన దాడుల్లో ఇరాన్‌కు భారీ నష్టం వాటిల్లిందని, ఇక ఆ దేశానికి యురేనియం శుద్ధి, బాలిస్టిక్ క్షిపణుల తయారీ సామర్థ్యం లేదని ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమిన్ నెతన్యాహు ప్రకటించారు. నెతన్యాహు ప్రకటించిన కొద్ది గంటల్లోనే నతాంజ్ అణు కేంద్రంపై దాడులు జరగడం గమనార్హం. నతాంజ్ అణు కేంద్రం టెహ్రాన్‌కు దాదాపు 220 కిలోమీటర్ల దూరంలో ఉంది.

## భార్య మరణం.. భర్త బలవన్మరణం

మొదటిపేజీ తరువాయి..

కరీంనగర్ జిల్లా ఇల్లందకుంట మండలం సీతంపేటకు చెందిన దివ్య(30)కు 2016లో దేసు చంద్రశేఖర్‌తో వివాహమైంది. ప్రస్తుతం వీరు కరీంనగర్‌లోని హనుమాన్‌నగర్‌లో ఉంటుండగా.. చంద్రశేఖర్ టూటౌన్‌లో ఎస్సైగా పనిచేస్తున్నాడు. వీరికి ఇద్దరు కొడుకులు. చంద్రశేఖర్ రోజుమాదిరిగా మంగళవారం ఇద్దరు పిల్లలను పాఠశాలలో వదిలి డ్యూటీకి వెళ్లాడు. కాగా దివ్య కొద్దిరోజులుగా కడుపునొప్పితో బాధపడుతున్నది. ఈ క్రమంలో మంగళవారం ఉదయం ఆమె గన్నేరుపూలు, ఆకులు మిక్సీ చేసుకొని తాగింది. విషయాన్ని తల్లిదండ్రులకు ఫోన్‌చేసి చెప్పింది. సమాచారం తెలిసిన భర్త దివ్యను హైదరాబాద్‌లోని హాస్పిటల్‌కు తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందింది. కాగా, దివ్య మృతికి చంద్రశేఖర్ కారణమని.. ఆమె అంత్యక్రియల సందర్భంగా ఎస్సైపై సీతంపేట గ్రామస్తులు దాడి చేశారు. ఆ సమయంలో ఆ దాడిని దివ్య తండ్రి అడ్డుకోవడం గమనార్హం. ఈ క్రమంలో భార్య మృతిని తట్టుకోలేని చంద్రశేఖర్ ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## అసెంబ్లీలో ప్రైవేట్ బిల్లు

మొదటిపేజీ తరువాయి..

అన్నిపార్టీలకు లేఖలు రాస్తామని చెప్పుకొచ్చారు. 840 రోజులు అయినా ఆరు గ్యారంటీలు ఎందుకు అమలు చేయట్లేదని మాజీ మంత్రి కేటీఆర్ ప్రశ్నించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు పెద్ద ఫ్రాడ్ అని ఎద్దేవా చేశారు. సీఎం సంతకం చేసిన ÷ల్ ఎందుకు దొరకడం లేదని నిలదీశారు. ఈ ఫైల్ ఢిల్లీ విమాన ప్రయాణంలో పోయిందా..?, ఎఫ్ఎస్ఎల్ అగ్నిప్రమాదంలో కాలిపోయిందా..? అని ప్రశ్నల వర్షం కురిపించారు. కాంగ్రెస్ సర్కార్ ఇంకా ఒక బ్జడెట్ మాత్రమే ప్రవేశపెట్టాల్సి ఉందని.. ఆరు గ్యారంటీలు ఎప్పుడు అమలు చేస్తారని ప్రశ్నించారు. ఆరు గ్యారంటీలు చట్టమైతే అన్నివర్గాలకు లాభం కలుగుతుందని చెప్పుకొచ్చారు. ప్రజల తరఫున ప్రైవేట్ మెంబర్ బిల్లు పెడుతున్నామని మాజీ మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. ఉమ్మడి ఏపీలో ప్రైవేట్ మెంబర్ బిల్లు ప్రవేశపెట్టిన చరిత్ర అసెంబ్లీకి ఉందని ప్రస్తావించారు. ఎన్టీఆర్ సీఎంగా ఉన్నప్పుడు.. బీజేపీ ప్రైవేట్ మెంబర్ బిల్లు పెట్టిందని మాజీ మంత్రి కేటీఆర్ చెప్పుకొచ్చారు. ప్రైవేట్ మెంబర్ బిల్లును పబ్లిక్ డొమైన్‌లో ఉంచుతామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఈ బిల్లుకు మద్దతు ఇవ్వాలని కోరారు. ప్రైవేట్ మెంబర్ బిల్లును బీజేపీ వ్యతిరేకించినా ఇబ్బంది లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఓట్ల కోసం కోటి మోసాలు చేసిందని ధ్వజమెత్తారు.

## శ్రమ మాది.. శిలాఫలకాలు మీవా?

మొదటిపేజీ తరువాయి..

అవన్నీ బీఆర్ఎస్ హయాంలో నిర్మించుకున్నవే అని తెలిపారు. శ్రమ ఫలితం మాది, శిలాఫలకాలు మీవా? అంటూ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ మేరకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై హరీశ్ రావు ఘాటు విమర్శలు చేశారు. సీఎం రేవంత్ ఆదివారం సిద్దిపేట పర్యటన నేపథ్యంలో పలు ప్రశ్నలు సంధించారు. మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని మేం అసెంబ్లీలో చేసిన ఒత్తిడితోనే కాంగ్రెస్ ప్రభుత్వం దిగివచ్చిందని హరీశ్ రావు తెలిపారు. మా పోరాటం ఫలితంగానే ఇవాళ రాష్ట్రవ్యాప్తంగా కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయని పేర్కొన్నారు. సిద్దిపేట వ్యవసాయ మార్కెట్ యార్డులో మొక్కజొన్న, పొద్దుతిరుగుడు కొనుగోలు కేంద్రాలను హరీశ్ రావు ప్రారంభించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వ వైఖరిని ఎండగట్టారు. సిద్దిపేట జిల్లా నర్మెట్టలో 365 ఎకరాల విస్తీర్ణంలో రూ.300 కోట్లతో నిర్మించిన ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు. 'సీఎం రేవంత్ రెడ్డి రేపు ప్రారంభించే ఆయిల్ ఫ్యాక్టరీ 2021లోనే ప్రారంభించాం. ఈ ఆయిల్ ఫామ్‌కి ప్రాణాధారం కాళేశ్వరం ప్రాజెక్టు. కాళేశ్వరాన్ని కూలేశ్వరం అన్న రేవంత్ రెడ్డి తన వైఖరి మార్చుకోవాలి. కాళేశ్వరాన్ని అడ్డుకోవడానికి ఆయన అనేక ప్రయత్నాలు చేశారు. మొక్కవోని దీక్షతో పూర్తి చేసింది మేము. ఇప్పటికైనా కాళేశ్వరంపై చిల్లర మాటలు మానుకో అని హితవు చెప్పారు. ఆ ప్రాజెక్టు పూర్తి చేయడంలో అనేక విధాలుగా శ్రమ పడ్డాం. 20 కోట్ల లీటర్ల నీటి నిలువ సామర్థ్యం కలిగిన పాండ్ నిర్మించాం. మలేషియా టెక్నాలజీతో ఇండియాలోనే అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించాం అన్నారు. బీఆర్ఎస్ కృషి ఫలితమే ఆయిల్ ఫ్యాక్టరీ. దాన్ని ఈరోజు రేవంత్ రెడ్డి ప్రారంభిస్తున్నారు. సెంట్రల్ డ్రగ్ స్టోర్, జిల్లా జైలు, ఆయుష్ ఆస్పత్రి, రెండు పీహెచ్సీలు నేను ఆరోగ్య శాఖ మంత్రిగా ఉండగా మంజూరు చేసి పూర్తి చేసినవి. వీటికి మీరు శిలాఫలకం వేసుకుని ప్రారంభిస్తున్నారు. ఇందులో మీరు చేసిందేమీ లేదు. మేము ఆలయాలు, విద్యాలయాలు, రిజర్వాయర్లు, జైళ్లు నిర్మించాం. రూ.78కోట్లతో 30 ఎకరాల్లో జిల్లా జైలు నిర్మించాం. కట్టించింది మేము, శిలాఫలకం మీరు వేసుకున్నారు. చేసుకో నాకేమీ ఈర్ష్య లేదు. కానీ శ్రమ ఎవరిది, శిలాఫలకం ఎవరిది?. కనపడిన ప్రతి దేవుడు మీద ఒట్టుపెట్టి రుణమాఫీ అన్నారు..

# డ్రగ్స్ కేసులో సిట్ దూకుడు

మొదటిపేజీ తరువాయి..

నమిత్ శర్మ, రోహిత్ రెడ్డి, రితేశ్‌రెడ్డి, పుట్టా మహేశ్ కుమార్, అర్జున్ రెడ్డి, కౌశిక్ రవి డ్రగ్స్ వినియోగించారు. నమిత్ శర్మ మూడు రకాల డ్రగ్స్ తీసుకున్నట్లు రక్త పరీక్షల్లో బయటపడగా.. పైలట్ రోహిత్ రెడ్డి, రితేశ్ రెడ్డి, అర్జున్ రెడ్డి మద్యంలో కొకైన్ కలుపుకుని తాగినట్లు వైద్య పరీక్షల్లో తేలింది. ÷ూజాగా, అభిషేక్ సింగ్ పోలీసులకు చిక్కడంతో మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అభిషేక్ సింగ్ నుంచి ఇంకా ఎవరెవరూ డ్రగ్స్ కొనుగోలు చేశారు? అనే విషయంపైనా కూపీ లాగుతున్నారు సిట్ అధికారులు. మరోవైపు అతని ఫోన్‌లో కీలక డేటా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు అభిషేక్ సింగ్ సెల్ ఫోన్ డేటాను విశ్లిస్తున్నారు సిట్ అధికారులు. మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డికి చెందిన మొయినాబాద్ ఫామ్ హౌస్ వ్యవహారం ఇప్పుడు పెను దుమారం రేపుతోంది. అజీజ్ నగర్‌లోని సర్వే నెంబర్ 177/33 పరిధిలో ఉన్న సుమారు 2.20 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించిన ఈ ఫామ్ హౌస్ పూర్తిగా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అసైన్డ్ భూమిలో కట్టినట్లు రెవెన్యూ అధికారులు జరిపిన విచారణలో నిర్ధారణ అయ్యింది. మొయినాబాద్ పోలీసులు ఫామ్‌హౌస్‌ను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. డ్రగ్స్ పార్టీ



నిర్వహించిన సమయంలో ఫామ్‌హౌస్‌లో జరిగిన పార్టీకి హాజరైన వారి విలాసవంతమైన వాహనాలను కూడా పోలీసులు సీజ్ చేశారు. ఈ ఫామ్‌హౌస్‌ను అసైన్డ్ భూమిలో నిర్మించినట్లు రెవెన్యూ అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. 2006లో ఈ భూమి రోహిత్ రెడ్డి తండ్రి విఠల్ రెడ్డి పేరుతో రిజిస్ట్రేషన్ అయినట్లు రికార్డులు చెబుతున్నప్పటికీ, భూభారతి రికార్డుల ప్రకారం అది జంగయ్య అనే వ్యక్తి పేరు మీద ఉన్నట్లు అధికారులు గుర్తించారు. అసలు ప్రభుత్వానికి చెందిన అసైన్డ్ భూమిపై రిజిస్ట్రేషన్ ఎలా జరిగిందనే అంశంపై ప్రస్తుతం రెవెన్యూ , పోలీస్ యంత్రాంగం లోతుగా ఆరా తీస్తోంది. ఈ అక్రమ నిర్మాణంపై కఠిన చర్యలు తీసుకోవాలని సిఫార్సు చేసిన రెవెన్యూ శాఖ, ఫామ్ హౌస్‌ను సీజ్ చేయాల్సిందిగా ఇప్పటికే అధికారులకు నివేదిక అందించింది. పోలీసుల విచారణలో భాగంగా ప్రస్తుతం ఈ ఫామ్ హౌస్ వారి కస్టడీలోనే ఉంది. అక్కడికి పార్టీ కోసం వచ్చిన వారి విలాసవంతమైన వాహనాలను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మొత్తం ఐదు లగ్జరీ కార్లను సీజ్ చేసి, ఆ సమాచారాన్ని కోర్టుకు నివేదించారు. పార్టీకి హాజరైన వారు తమ వాహనాలను అక్కడే వదిలేసి వెళ్లడంతో పోలీసులు వాటిని సీజ్ చేసి విచారణను వేగవంతం చేశారు. త్వరలోనే ఈ ఫామ్ హౌస్ సీజ్ ప్రక్రియ పూర్తయ్యే అవకాశం కనిపిస్తోంది.

## 48 గంటల డెడ్ లైన్!

మొదటిపేజీ తరువాయి..

ఇటీవల అమెరికా-ఇజ్రాయెల్ దాడుల నేపథ్యంలో ఇరాన్ హర్మూజ్ జలసంధిని మూసివేసింది. ఇది ప్రపంచ చమురు సరఫరాలో కీలక మార్గం కావడంతో అంతర్జాతీయ మార్కెట్లలో ఆందోళనలు నెలకొన్నాయి. చమురు రవాణా అంతరాయం కలిగితే ప్రపంచవ్యాప్తంగా ఇంధన ధరలు పెరిగే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ట్రంప్ చేసిన తాజా ప్రకటనలు ఉద్రిక్తతలను మరింత పెంచే అవకాశం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## ద్రవ్యోల్బణంతో జాగ్రత్త!

మొదటిపేజీ తరువాయి..

కరెన్సీ పతనం, ధరలు పెరుగుదల ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతాయని అన్నారు. ఇది సాధారణ పరిస్థితి అని ప్రభుత్వం చెప్పవచ్చు కానీ వాస్తవం అందుకు భిన్నంగా ఉందని, సామాన్యుడి జేబుకు చిల్లుపడుతుందని అన్నారు. సామాన్యుడిపై నాలుగు రకాలుగా ద్రవ్యోల్బణం ప్రభావం పడుతుందని రాహుల్ పేర్కొన్నారు. వస్తువుల ఉత్పత్తి, రవాణా ఖర్చులు పెరుగుతాయని, చిన్న, మధ్యతరహా పరిశ్రమలపై (ఎంఎస్ఎంఈ) తీవ్ర ప్రభావం పడి అవి కుదేలవు తాయని, ప్రతి వస్తువు ధర పెరిగిపోతుందని, విదేశీ పెట్టుబడులు దేశం నుంచి వేగంగా తరలిపోతాయని, ఇందువల్ల స్టాక్ మార్కెట్లు తీవ్ర ఒత్తిడికి లోనవుతాయని చెప్పారు. త్వరలో నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతంలో ఎన్నికలు




జరుగనున్నాయని, అవి పూర్తి కాగానే పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ ధరలను ప్రభుత్వం భారీగా పెంచుతుందని రాహుల్ జోస్యం చెప్పారు. కేంద్రంపై నేరుగా విరుచుపడుతూ... ఆర్థిక సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనే స్పష్టమైన ప్రణాళిక ఏదీ కేంద్రం వద్ద లేదని అన్నారు. 'మోదీ ప్రభుత్వానికి దిశానిర్దేశర కానీ వ్యూహం కానీ లేవు. వారి వద్ద ఒట్టి మాటలే ఉన్నాయి. ప్రభుత్వం ఏమి చెబుతుందనేది కాదు..సామాన్యుడి పళ్ళెంలో ఏమి మిగిలిందనేదే అసలు ప్రశ్న' అని రాహుల్ ఆ ట్వీట్‌లో పేర్కొన్నారు.

## గ్యాస్ కొరత నివారణకు కేంద్రం చర్యలు

న్యూఢిల్లీ,మార్చి21(అడుగు న్యూస్): వాణిజ్య గ్యాస్ కొరతను అధిగమించేందుకు చర్యలు చేపట్టిన కేంద్రం.. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు వాణిజ్య ఎల్పీజీలో అదనంగా 20శాతం కేటాయించేందుకు ఆమోదం తెలిపింది. తాజా చర్యతో సంక్షోభ కాలానికి ముందున్న కేటాయింపుల్లో 50శాతానికి చేరినట్లయ్యిందని పేర్కొంది. అయితే, వీటిలో హోటళ్లు, రెస్టరంట్లు, దాబాలు, పారిశ్రామిక క్యాంటీన్లు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, కమ్యూనిటీ కిచెన్‌లు, సబ్సిడీల్లో ఆహారం అందించే కేంద్రాలకు ప్రాధాన్యం ఇవ్వాలని కేంద్రం సూచించింది. చమురు కంపెనీల వద్ద రిజిస్టరైన వాణిజ్య సంస్థలతోపాటు పీఎన్‌జీ (పైపు ద్వారా గ్యాస్ పంపిణీ) కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న వాటికే ఈ అదనపు కేటాయింపు వర్తిస్తుందని కేంద్రం పేర్కొంది. మార్చి 23 నుంచి ఈ అదనపు కేటాయింపులు సరఫరా చేస్తామని తెలిపింది.

## యుద్ధాన్ని ఆపండి : మోదీకి ఇరాన్ మొర

మొదటిపేజీ తరువాయి..



ముప్పు కలిగిస్తాయని, ప్రపంచ సరఫరా గొలుసులకు అంతరాయం కలిగిస్తాయని నొక్కి చెప్పారు. నౌకాయాన స్వేచ్ఛను పరిరక్షించడం, షిప్పింగ్ మార్గాలు తెరిచి సురక్షితంగా ఉండేలా చూడాలని దాని ప్రాముఖ్యతను మోడీ ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. ఈ మేరకు మోడీ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు.

సమగ్ర తెలుగు దినపత్రిక
అడుగు
The Step Towords The Truth..

## లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం

పాలకుర్తి, మార్చి 21(అడుగు న్యూస్):
లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ జిల్లా గవర్నర్ లయన్ డా. కె. చంద్రశేఖర్ ఆర్య శనివారం పాలకుర్తి క్లబ్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పేదలకు దుప్పట్లు, చిరు వ్యాపారులకు గొడుగులు పంపిణీ చేయడంతో పాటు, గూడూరు గ్రామంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు



చేశారు. ఈ ఏడాది క్లబ్ ప్రదర్శించిన సేవా నిరతికి గాను రీజియన్ స్థాయిలో "బెస్ట్ క్లబ్ అవార్డు" లభించడం పట్ల గవర్నర్ హర్షం వ్యక్తం చేశారు. సభ్యుల నిబద్ధతను ప్రశంసిస్తూ, భవిష్యత్తులో విద్యా, పర్యావరణ రంగాల్లో మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మాచర్ల స్వరూప పుల్లయ్య, క్లబ్ అధ్యక్షులు చారగొండ్ల ప్రసాద్, ప్రధాన కార్యదర్శి కృపాకర్, పబ్బా సంతోష్, స్థానిక ప్రజాప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

## ఏపీ టీడీపీలో తీవ్ర విషాదం

### మాజీ ఎమ్మెల్యే ఉన్నం కన్నుమూత

అనంతపురం, మార్చి 21(అడుగు న్యూస్):
తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కళ్యాణదుర్గం మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయ చౌదరి (80) శనివారం తెల్లవారుజామున



తుదిశ్వాస విడిచారు. గత కొంతకాలంగా గుండె, శ్వాసకోశ సంబంధిత సమస్యలతో బాధపడుతున్న ఆయన, అనంతపురంలోని కిమ్స్ సవేరా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. సర్పంచ్‌గా రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన ఉన్నం, 10 ఏళ్ల పాటు అనంతపురం జిల్లా టీడీపీ అధ్యక్షుడిగా, మార్క్‌ఫెడ్ చైర్మన్‌గా సేవలు అందించారు. 2014లో కళ్యాణదుర్గం ఎమ్మెల్యేగా విజయం సాధించి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేశారు.
ఆయన మృతి పట్ల సీఎం, మంత్రులు సవిత, పరిటాల సునీత, బండారు శ్రావణి, తలారి రంగయ్య, కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి రఘువీరారెడ్డి తదితరులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఉన్నం భౌతికదేహానికి పార్టీ జెండా కప్పి నివాళులర్పించారు. క్రమశిక్షణ కలిగిన నాయకుడిగా పార్టీ బలోపేతానికి ఆయన చేసిన కృషి మరువలేనిదని నేతలు కొనియాడారు. ఆదివారం ఉదయం ఆయన స్వగ్రామమైన ఎర్రంపల్లిలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయనకు ముగ్గురు కుమారులు ఉన్నారు.

## రూ.300 కోట్లు.. 3 దశలు

### భద్రాచల రాముడి గుడి అభివృద్ధి
### మంత్రులతో మాస్టర్ ప్లాన్ ను సమీక్షించిన సీఎం

హైదరాబాద్, మార్చి 21 (అడుగు న్యూస్):
భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం మరింత సర్వాంగ సుందరంగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం భారీ ప్రణాళికను సిద్ధం చేసింది. ఆలయ అభివృద్ధి కోసం సుమారు రూ.300 కోట్ల నిధులు కేటాయించేందుకు ప్రభుత్వం సిద్ధమైనట్లు సమాచారం. శనివారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన నివాసంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, కొండా సురేఖలతో సమావేశమై దేవాదాయ శాఖ రూపొందించిన మాస్టర్ ప్లాన్‌పై సమగ్రంగా చర్చించారు.
ఇప్పటివరకు రూ.100 కోట్లకు పరిమితమైన ప్రణాళికను విస్తరించి రూ.300 కోట్లకు పెంచాలని నిర్ణయించినట్లు తెలిసింది. ఆలయంలో రెండు కొత్త ప్రాకారాల నిర్మాణం, ప్రదక్షిణ మార్గాన్ని నలుదిక్కులా సమానంగా విస్తరించడం, కల్యాణ మండపాల అభివృద్ధి, భక్తులకు సౌకర్యవంతమైన వసతుల కల్పన వంటి పనులు చేపట్టనున్నారు. ప్రస్తుతం అసమానంగా ఉన్న ప్రదక్షిణ దారిని విస్తరించి సౌకర్యవంతంగా మార్చాలని అధికారులు నిర్ణయించారు.
ఆలయ సహజత్వానికి భంగం కలగకుండా ఆగమ శాస్త్రాలకు అనుగుణంగా పనులు చేయాలని సీఎం స్పష్టం చేశారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా దశలవారీగా పనులు పూర్తి చేయాలని సూచించారు. 2027 జూన్ 20 నుంచి ప్రారంభమయ్యే గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని, తొలి దశ పనులను 2027 మార్చి 31 నాటికి పూర్తి చేసేలా ప్రణాళిక రూపొందించాలని అధికారులకు ఆదేశించారు. పుష్కరాల అనంతరం మిగిలిన పనులను పూర్తి చేయాలని సూచించారు. అలాగే ఈ నెల 21న జరిగే శ్రీరామనవమి ఉత్సవాలకు సీఎం రేవంత్ రెడ్డి హాజరై, ప్రభుత్వం తరఫున స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించనున్నట్లు సమాచారం.
తమిళనాడు, కేరళను అనుకుని ఉపరిత ఆవర్తనం

## 24 వరకు ఉరుములు, మెరుపులతో వర్షం

### వాతావరణ కేంద్రం వెల్లడి

చెన్నై,మార్చి21(అడుగు న్యూస్):
మన్నార్ గల్ఫ్ నుంచి దక్షిణ కర్ణాటక అంతర్గత ప్రాంతాలు, తమిళనాడు, పరిసరాల్లో కేరళ ఆనుకొని ఏర్పడిన ఉపరితల ఆవర్తన ద్రోణి కారణంగా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఈ నెల 24 వరకు ఉరుములు, మెరుపులతో వర్షం కురిసే అవకాశముంది. ఈ మేరకు వాతావరణ కేంద్రం విడుదల చేసిన ప్రకటనలో... రాష్ట్రంలో తిరుచ్చి, పెరంబలూరు, అరియలూరు జిల్లాల్లోని ఒకటి, రెండు ప్రాంతాల్లో శనివారం భారీ వర్షం కురిసింది. ఈ నెల 24వ తేది వరకు తమిళనాడు, పుదుచ్చేరి, కారైక్కాల్ ప్రాంతాల్లోని ఒకటి, రెండు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి భారీవర్షం కురిసే అవకాశముంది. రాజధాని నగరం చెన్నైలో రానున్న 48 గంటల్లో ఆకాశం మేఘావృతంగా ఉంటూ కొన్ని ప్రాంతాల్లో రాత్రి వేళల్లో ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం తెలిపింది.



## మిన్నంటిన రంజాన్ వేడుకలు

భువనగిరి, మార్చి 21 (అడుగు న్యూస్):
రాష్ట్రవ్యాప్తంగా రంజాన్ పండుగ వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ముస్లిం సోదరులు ఈద్గాల వద్ద పవిత్ర ప్రార్థనలు నిర్వహించి, ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకుంటూ సోదరభావాన్ని చాటుకున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మున్సిపాలిటీ 22వ వార్డులో మైనారిటీ నాయకుల ఆహ్వానం మేరకు కౌన్సిలర్ జాలిగం విఘ్నేష్ వారి నివాసాలను సందర్శించి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గాయపాక పృథ్వీ రాజ్, జాలిగం శివ, ఇటుకల దేవేందర్ తదితరులు పాల్గొన్నారు. మరోవైపు, వరంగల్ జిల్లా, రాయపర్తిలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు సుధీర్ రెడ్డి ముస్లిం సోదరులతో కలిసి 'అలయ్ బలయ్' కార్యక్రమంలో పాల్గొన్నారు. హిందూ-ముస్లిం ఐక్యత వర్ధిల్లాలని, అల్లా దీవెనలతో అందరూ సుఖశాంతులతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ వేడుకలో వాడ సదర్ సలీం, యూసుఫ్, రఫీ వంటి ప్రముఖులు పాల్గొన్నారు. అలాగే, జనగామ జిల్లా పాలకుర్తిలో కూడా ఈద్గా వద్ద ముస్లింలు పెద్ద ఎత్తున పవిత్ర ప్రార్థనలు నిర్వహించారు. ఈ వేడుకలు కులమతాలకు అతీతంగా గంగా-జమునా తెహజీబ్‌ను ప్రతిబింబించాయి.

## నేడే రైతు ఖాతాల్లోకి భరోసా నిధులు

మొదటిపేజీ తరువాయి..

పంటగా ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్తోంది. ఈ నేపథ్యంలో నర్మెట్టలో అత్యాధునిక ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ యూనిట్ నిర్మించారు. సుమారు 62 ఎకరాల విస్తీర్ణంలో రూ.300 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ ఫ్యాక్టరీ ఆధునిక సాంకేతికతతో రూపొందించారు. ప్రారంభంలో గంటకు 30 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో పనిచేసే ఈ



మిల్లు భవిష్యత్తులో 120 మెట్రిక్ టన్నుల వరకు విస్తరించేలా రూపకల్పన చేశారు. ఈ ప్రాజెక్టు వేగంగా పూర్తికావడంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కీలక పాత్ర పోషించారు. ఆయన తరచుగా క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పనుల పురోగతిని సమీక్షించారు. అదే విధంగా జంగా రాఘవరెడ్డి నాయకత్వంలో ఆయిల్ ఫెడ్ అధికారులు ఫ్యాక్టరీ నిర్మాణాన్ని రికార్డు సమయంలో పూర్తి చేశారు. ఫ్యాక్టరీ ప్రారంభోత్సవం సందర్భంగా మార్చి 20 నుంచి 22 వరకు మూడు రోజులపాటు రైతు మేళా నిర్వహిస్తున్నారు. ఇందులో ఆధునిక వ్యవసాయ పద్ధతులు, ప్రభుత్వ పథకాలు, ఆయిల్ పామ్ సాగులోని మెలకువలపై రైతులకు ప్రత్యక్ష అవగాహన కల్పిస్తున్నారు. రైతులకు తక్షణ ఆర్థిక సహాయం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా నిధులను విడుదల చేయాలని నిర్ణయించింది. మొదటి విడతగా నర్మెట్టలో జరిగే కార్యక్రమంలో 70 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.3,590 కోట్లు నేరుగా జమ చేయనున్నారు. అనంతరం మరో 20 రోజుల తర్వాత రూ.2,650 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేయనున్నారు. ఏప్రిల్ నెలాఖరులోగా మిగిలిన రైతులకు కూడా నిధులు అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. మొత్తంగా రాష్ట్రంలో 1.50 కోట్ల ఎకరాలకు సంబంధించి సుమారు రూ.9,000 కోట్లు రైతు భరోసా నిధులు రైతుల ఖాతాల్లో జమ కానున్నాయి. రైతులు వ్యవసాయరంగంలో ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి .. ఆదాయం బాటలో నడవాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం రైతు మహోత్సవ మేళా కార్యక్రమాన్ని సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెటలో నిర్వహిస్తోంది. ఈ మేళాలో వ్యవసాయం, ఉద్యానం, పట్టుపరిశ్రమ, మత్స్యశాఖ, మార్క్‌ఫెడ్, విత్తనాభివృద్ధి సంస్థ, చేనేత జౌళి శాఖలతోపాటు విజయడైరీ, సాగు యంత్రాలతో 150 స్టాళను ఏర్పాటు చేశారు. సిద్దిపేట, రాజన్న సిరిసిల్ల, జనగామ, కరీంనగర్, హనుమకొండ, యాదాద్రి భువనగిరి, సంగారెడ్డి, మెదక్, వరంగల్, కామారెడ్డి జిల్లాల నుంచి 50 వేల మందికి పైగా పాల్గొంటున్నట్టు జిల్లా వ్యవసాయ అధికారిణి స్వరూపరాణి తెలిపారు. సోలార్ సాంకేతిక పరిజ్ఞానంతో ఫోన్ యాప్ ద్వారా పొలానికి నీరు అందించే పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చింది. 'ఆటోపామ్' సంస్థ వారు ఫోన్‌ను వాడుతూ పంటకు నీరు అందించే సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తెచ్చారు. బిందు సేద్యంలో పంటకు మందులను సైతం పంపవచ్చు. ఒకసారి ఏర్పాటు చేసుకుంటే పదేళ్ల పాటు వినియోగించుకోవచ్చని సంస్థ నిర్వాహకులు తెలిపారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థులు ఆవిష్కరించిన సమీకృత వ్యవసాయ ప్రదర్శన ఇది. చిన్న, సన్నకారు రైతులకు ఎంతో లాభదాయకం. 2-3 ఎకరాలు భూమి ఉన్న రైతులు ఒకే పంట కాకుండా వరి, కందులు, మొక్కజొన్న, కూరగాయలు, ఆకుకూరలు, పశు గ్రాసం, కోళ్ల పెంపకం, పాడి పరిశ్రమ, చేపలు, గొర్రెలు, మేకల పెంపకం చేపట్టవచ్చు. రోజూ ఆదాయం పొందవచ్చని విద్యార్థిని శివాని తెలిపారు. సంప్రదాయ పంటలను సాగు చేసి నష్టాలు చవిచూసిన రైతులకు అధిక దిడుబడులు సాధించే దిశగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆవిష్కరించిన నూతన వంగడాలు ఇవి. వరి రకాలు తెలంగాణ సోనా, కె.యన్.ఎమ్ 1638, కంది డబ్ల్యూఆర్జీ 255, పెసర ఎం.జి.జి. 385, వేరుశనగ జేసీజీ 2141, ఆముదం పీసీఎస్ 262, తెలంగాణ జొన్న, పాలెం రాగి వంటి సంకర జాతి విత్తనాలను ప్రదర్శించారు.

## తగ్గేదేలే...

మొదటిపేజీ తరువాయి..

మంత్రి శ్రీధర్‌బాబు మీడియాతో మాట్లాడారు. జీవన్‌రెడ్డి 4 దశాబ్దాలుగా పార్టీలో ఉన్నారని అన్నారు. ఆయనతో అనేక అంశాలు చర్చించినట్లు తెలిపారు. ఆయన ఆవేదనను పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. ఈ భేటీ అనంతరం జీవన్‌రెడ్డి మాట్లాడారు. తన నిర్ణయంలో ఎలాంటి మార్పు లేదన్నారు. పూర్తి వివరాలు రేపు వెల్లడిస్తానని చెప్పారు. కొంతకాలంగా కాంగ్రెస్ పార్టీపై అసంతృప్తితో ఉన్న మాజీ మంత్రి, సీనియర్ నాయకులు జీవన్‌రెడ్డి పార్టీ మారుతారన్న ప్రచారంతో ఇద్దరు మంత్రులను కాంగ్రెస్ రంగంలోకి దింపింది. పార్టీ వీడకుండా ఉండేందుకు ఆయనతో మంత్రులు శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్ సంప్రదింపులు మొదలుపెట్టారు. పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తూ.. అసలు కాంగ్రెస్ నాయకులకు అన్యాయం చేయడంపై జీవన్ రెడ్డి కొంతకాలంగా బహిరంగంగానే అసమ్మతి తెలుపుతున్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలని కూడా ఆయన అధిష్ఠానాన్ని కోరారు. కానీ హైకమాండ్ పట్టించుకోకపోవడంతో పార్టీని వీడేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలోనే హైదరాబాద్‌లో సమావేశానికి రావాలని రాష్ట్ర ఏఐసీసీ వ్యవహారాల ఇంచార్జి మీనాక్షి నటరాజన్ ఆహ్వానించారు. కానీ మీనాక్షి నటరాజన్‌తో జరగాల్సిన మీటింగ్‌కు జీవన్ రెడ్డి గైర్హాజరయ్యారు. ఈ క్రమంలోనే జీవన్ రెడ్డి ఇంటికి




ఉదయం మంత్రులు శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్, చొప్పదండి ఎమ్మెల్యే, కరీంనగర్ డీసీసీ అధ్యక్షుడు మేడిపల్లి సత్యం, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి వెళ్లారు. జీవన్ రెడ్డితో అల్పాహారం చేస్తూ ముచ్చటిస్తున్నారు. కాగా, రాజీవ్ గాంధీ ఆశయాలకు అనుగుణంగా ఇవాళ కాంగ్రెస్ పార్టీ లేదని జీవన్ రెడ్డి అసహనం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఈ సమయంలో మీడియాను లోపలికి అనుమతించకుండా రహస్యంగా చర్చించారు. ఈ నెల 25వ తేదీన కాంగ్రెస్ పార్టీకి జీవన్ రెడ్డి రాజీనామా చేస్తున్నారని సమాచారం.




## గ్యాస్ సిలిండరే కట్టెల పొయ్యి!?

అంతా గ్యాసే! ఇంటింటా, వంటింటా.. ఓటల్లు, ఫంక్షన్ హాల్లు.. ఏడ సూసినా గ్యాసే. ఇగిప్పుడు గా యుద్ధం సేయబట్టి, గా గ్యాస్ కు కొరతొచ్చె. మరి గ్యాస్ లేకపోతే ఎల్లదాయె. ఇగ కట్టెల పొయ్యి కట్టాలను ఏనాడో పక్కన పెడితిమి. ఇగిప్పుడు ఏం శేయాల్నని అంతా ఆలోశిస్తాంటే... గాయినొకాయెనె గా గ్యాస్ సిలిండర్ నే కట్టెల పొయ్యి శేసిండు.



గ్యాస్ సిలిండర్ ను తీసుకున్నడు గదాని తలా తోక తీసేసిండు. గుండ్రంగ ఉండే దానికి ఒక పక్కన ఒడుపుగ కత్తిరించి, తలుపు లెక్క శేసిండు. ఇగ ఇంకోకెల్లి కట్టెలు పెట్టడానికి సందు శేసిండు. గదాంట్లనే పొయ్యిని శేసిండు. ఇగ గదాన్ని పొయ్యి లెక్క ఆడుతున్నడు. మంచిగుంది కదా గీ ఉపాయం. మనమంతా ఎనకటి రోజులకే యెలతానమా ఏంది?

## వల్మీడి రాములోరి కళ్యాణంకు భారీ ఏర్పాట్లు

### పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి సమీక్ష

పాలకుర్తి, మార్చి 22 (అడుగు న్యూస్):
జనగామ జిల్లా, పాలకుర్తి మండలంలో శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని వల్మీడి శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం వార్షిక ఉత్సవాల నిర్వహణపై ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, తొర్రూరు మార్కెట్ కమిటీ చైర్మన్ హనుమాండ్ల తిరుపతి రెడ్డి తో కలిసి ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో దేవస్థానం అధికారులు, నూతన కమిటీ సభ్యులు



పాల్గొన్నారు. ఈ నెల 27న జరగనున్న స్వామివారి కళ్యాణ మహోత్సవాన్ని భక్తి శ్రద్ధలతో, అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు కచ్చితంగా పూర్తి చేయాలని ఆమె ఆదేశించారు. ఆలయ పరిసరాల శుభ్రత, విద్యుత్ దీపాలంకరణ, తాగునీటి సదుపాయం, భక్తులకు క్యూలైన్ వ్యవస్థ, పార్కింగ్ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. భక్తులు భారీగా తరలివచ్చే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టంగా ఉండాలని, ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వైద్య శిబిరాలు, అత్యవసర సేవలు సిద్ధంగా ఉంచాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా 2026 బ్రహ్మోత్సవాల పోస్టర్‌ను ఎమ్మెల్యే ఘనంగా ఆవిష్కరించారు. ఉత్సవాలను శాస్త్రోక్తంగా నిర్వహించేందుకు సమన్వయంతో పనిచేయాలని ఆమె సూచించారు. భక్తులకు సౌకర్యవంతమైన దర్శనం కల్పించడం లక్ష్యంగా అన్ని శాఖలు సమిష్టిగా కృషి చేయాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఈ సమీక్షలో ఆలయ ఈవో మోహన్ బాబు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రాపాక సత్యనారాయణ, మండల అధ్యక్షులు గిరగాని కుమారస్వామి, ఎర్రబెల్లి రాఘవరావు, పాలకుర్తి మండల కోఆర్డినేటర్ ఇట్టే శ్యాంసుందర్ రెడ్డి, గ్రామ సర్పంచ్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## అతిపెద్ద చొరబాటుదారు మోదీయే

మొదటిపేజీ తరువాయి..

బహిరంగ సభలో మోదీపై, బీజేపీపై విమర్శలు గుప్పించారు. 'దేశంలో అతిపెద్ద చొరబాటుదారుడు మోదీ. బెంగాల్‌ను ఎవరు లక్ష్యంగా చేసుకుంటారో వారు నరకానికి వెళ్తారు. బీజేపీని రాష్ట్రంలోకి రాకుండా చూస్తాం. మోదీ నుంచి, బీజేపీ నుంచి దేశాన్ని, బెంగాల్‌ను కాపాడటమే టీఎంసీ ప్రాథమిక కర్తవ్యం. బెంగాల్ మత సామరస్యాన్ని కాపాడుతాం. సర్ ద్వారా ప్రజల ఓటు హక్కుల్ని కాలరాసింది బీజేపీ. సర్‌కు వ్యతిరేకంగా పోరాడుతూనే ఉంటాం. బీజేపీ అంటే గూండాలు, దొంగల పార్టీ. మీ ఓటు హక్కును మోదీ తీసుకోకుండా చూస్తా. ప్రజాస్వామ్యాన్ని, ప్రతి పౌరుడి హక్కుల్ని కాపాడేందుకు పోరాడుదాం. కొందరు ప్రజల ఓట్లు సర్ పేరుతో తీసేశారు. నేను దీనికోసం కోల్‌కతా నుంచి ఢిల్లీ వరకు, హైకోర్టు నుంచి సుప్రీంకోర్టు దాకా వెళ్లా. ప్రజల హక్కులకు రక్షణ దొరుకుతుందనుకుంటున్నా. బెంగాల్‌లోని అన్ని కులాలు, వర్గాల ప్రజలకు అండగా ఉంటా' అని మమత వ్యాఖ్యానించారు. అయితే, మమత వ్యాఖ్యలపై బెంగాల్ బీజేపీ నేతలు మండిపడ్డారు. ఎన్నికల్లో ఓడిపోతామనే నిరాశ, భయంతో మమత ఇలా ప్రధానిపై విమర్శలు చేస్తున్నారని బీజేపీ నేత శిశిర్ బజోరియా అన్నారు. మమత ఉపయోగించిన భాష సరికాదన్నారు. ప్రధాని మోదీని చొరబాటుదారుడు అని ఎవరు అన్నా వారికి రాజ్యాంగబద్ధమైన పదవిలో కొనసాగే అర్హత లేదని విమర్శించారు. ఇక, బెంగాల్‌లో ఏప్రిల్ 23, 29 తేదీలలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. మే 4న ఫలితాలు వెలువడుతాయి.

## ఎమ్మెల్యే దానంపై హై కోర్టుకు బీజేపీ

మొదటిపేజీ తరువాయి..

స్పీకర్ ఇచ్చిన క్లీన్ చిట్ రాజ్యాంగ విరుద్ధమని ఆయన తన పిటిషన్‌లో పేర్కొన్నారు. గత సాధారణ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ తరఫున ఖైరతాబాద్ నుంచి గెలుపొందిన దానం నాగేందర్, ఆ తర్వాత అధికార కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ కండువా కప్పుకోవడమే కాకుండా, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా ఎంపీ ఎన్నికల్లో కూడా పోటీ చేశారు. బీఆర్ఎస్ బీ-ఫామ్ ద్వారా గెలిచి మరో పార్టీలోకి వెళ్లినందున ఆయనపై అనర్హత వేటు వేయాలని ఏలేటి మహేశ్వర్ రెడ్డి గతంలోనే స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు. ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న 10 మంది ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై విచారణ జరిపిన స్పీకర్, దానం నాగేందర్ అసలు పార్టీ మారలేదని, ఆయనపై వచ్చిన ఆరోపణల్లో వాస్తవం లేదని క్లీన్ చిట్ ఇచ్చారు. అయితే, బహిరంగంగానే పార్టీ మారిన వ్యక్తికి స్పీకర్ ఇలాంటి తీర్పు ఇవ్వడాన్ని సవాల్ చేస్తూ ఏలేటి మహేశ్వర్ రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌లో అసెంబ్లీ స్పీకర్‌ను , దానం నాగేందర్‌ను ప్రతివాదులుగా చేర్చారు. ఈ కీలక పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం సోమవారం విచారణ జరపనుంది. స్పీకర్ నిర్ణయంపై కోర్టు ఏ రకమైన స్పందన తెలియజేస్తుందోనని రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది. ఈ విచారణలో పిటిషనర్ తరఫున, స్పీకర్ తరఫున , దానం నాగేందర్ తరపు న్యాయవాదులు తమ వాదనలను వినిపించనున్నారు.

సమగ్ర తెలుగు దినపత్రిక
అడుగు
The Step Towords The Truth..

# కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టుకు వరుస షాకులు

## ఫాస్ట్ బౌలర్ ఆకాష్‌దీప్ జట్టుకు దూరం

ఐపీఎల్ 2026 సీజన్ ఆరంభానికి ముందే కోల్‌కతా నైట్ రైడర్స్ (జట్టుకు వరుస షాకులు తగులుతున్నాయి. ఇప్పటికే స్టార్ బౌలర్ హర్షిత్ రాణా గాయం కారణంగా టోర్నీకి దూరం కాగా, ఇప్పుడు మరో కీలక ఫాస్ట్ బౌలర్ ఆకాష్‌దీప్ కూడా జట్టుకు అందుబాటులో ఉండటం లేదని ఇండియా టూడే కథనం పేర్కొంది. వరుసగా ఇద్దరు ప్రధాన పేసర్లు కావడంతో వైద్య బృందం అతనికి విశ్రాంతి అవసరమని సూచించింది. కేకేఆర్ జట్టుకు గతంలో బౌలింగ్ ప్రధాన బలంగా ఉండేది. ఇప్పుడు ఆ విభాగంలోనే ఖాళీలు ఏర్పడటం అభిమానులను కలవరపెడుతోంది. మెగా వేలంలో కొనుగోలు చేసిన ప్రధాన అస్త్రాలు ఇలా చేజారిపోవడం వల్ల కెప్టెన్ కూడా కొత్త ప్రణాళికలు సిద్ధం చేసుకోవాల్సి వస్తోంది. నెట్



దూరం కావడంతో కేకేఆర్ యాజమాన్యం తీవ్ర ఆందోళనలో పడింది. టోర్నీ మొదలవ్వడానికి కొన్ని రోజుల సమయం మాత్రమే ఉండటంతో జట్టు బౌలింగ్ విభాగం బలహీనపడే అవకాశం ఉంది. ప్రత్యామ్నాయ ఆటగాళ్ల కోసం ఫ్రాంచైజీ వేట మొదలుపెట్టింది. గతేడాది అద్భుత ప్రదర్శన చేసిన ఈ పేసర్లు లేకపోవడం జట్టు వ్యూహాలపై ప్రభావం చూపుతుంది. దేశవాళీ క్రికెట్‌లో రాణిస్తున్న ప్రతిభావంతులైన యువ బౌలర్లను లేదా అమ్ముడుపోని విదేశీ ఆటగాళ్లను తీసుకోవాలని టీమ్ మేనేజ్‌మెంట్ ఆలోచిస్తోంది. ఈ పరిస్థితుల్లో కొత్త ఆటగాడు జట్టులో ఎంత త్వరగా ఇమిడిపోతాడనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. రెండో పేసర్ కూడా దూరం కావడంతో కేకేఆర్ బౌలింగ్ లైనప్ ఒక్కసారిగా తలకిందులైంది. ప్రాక్టీస్ సెషన్ల సమయంలో ఈ బౌలర్ గాయపడినట్లు తెలుస్తోంది. ఫిట్‌నెస్ పరీక్షల్లో విఫలం బౌలర్ల నుండి ఎవరినైనా ప్రధాన జట్టులోకి తీసుకునే అవకాశం ఉందేమో అని కూడా పరిశీలిస్తున్నారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం, బీసీసీఐ నిబంధనల మేరకు కేకేఆర్ ఫ్రాంచైజీ త్వరలోనే అధికారికంగా రీప్లేస్‌మెంట్ (ప్రత్యామ్నాయ ఆటగాడి) పేరును ప్రకటించనుంది. దేశవాళీ టోర్నీల్లో వేగంగా బౌలింగ్ చేసే కుర్రాళ్లపై సెలెక్టర్లు కన్నేశారు. ఐపీఎల్ వంటి పెద్ద వేదికపై ఒత్తిడిని తట్టుకోగల ఆటగాడి కోసం వెతుకుతున్నారు. ఒకవేళ సరైన బౌలర్ దొరకకపోతే జట్టులోని స్పిన్నర్లపై ఎక్కువ భారం పడే అవకాశం ఉంది. రాబోయే మ్యాచ్‌లకు ముందే కొత్త బౌలర్ జట్టుతో చేరి శిక్షణ తీసుకోవాల్సి ఉంటుంది. ఇతర జట్లు కూడా తమ బౌలింగ్ విభాగాలను బలోపేతం చేసుకుంటున్న తరుణంలో, కేకేఆర్ తీసుకునే నిర్ణయం వారి ప్లేఆఫ్ అవకాశాలను నిర్ణయిస్తుంది.

# సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు భారీ ఎదురుదెబ్బ

## విదేశీ ఆల్‌రౌండర్ జాక్ ఎడ్వర్డ్స్ దూరం

ఈ మార్చి 28న ఐపీఎల్ 2026 ప్రారంభం కానుంది. ఈ క్రమంలో సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు భారీ ఎదురుదెబ్బ తగిలింది. విదేశీ ఆల్‌రౌండర్ జాక్ ఎడ్వర్డ్స్ ఐపీఎల్ 2026 సీజన్ నుంచి తప్పుకున్నాడు. గాయం కారణంగా జాక్ ఈ ఐపీఎల్ సీజన్ మొత్తం దూరంగా ఉండబోతున్నాడు. ఇప్పటికే వెన్ను నొప్పి కారణంగా పాట్ కమిన్స్ కొన్ని మ్యాచులకు దూరంగా ఉండనున్న సంగతి తెలిసిందే. అయితే.. గాయం కారణంగా జాక్ ఈ సీజన్ మొత్తం దూరం కావాల్సి వచ్చింది. ఈ సీజన్‌లో హైదరాబాద్ శిబిరంలో గాయపడిన రెండవ క్రికెటర్‌గా ఎడ్వర్డ్స్ నిలిచాడు. కెప్టెన్ కమిన్స్ ఇప్పుడిప్పుడే వెన్నునొప్పి నుంచి కోలుకుంటున్నాడు. ఈ సీజన్‌లోని మొదటి కొన్ని మ్యాచ్‌లకు కమిన్స్ దూరంగా ఉండనున్నాడు. దీంతో ఇషాన్ కిషన్ జట్టుకు నాయకత్వం వహించనుండగా, అభిషేక్ శర్మ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. ఇదిలా ఉండగా.. మార్చి 19న ముగ్గురు క్రికెటర్లు ఈ సీజన్ నుంచి వైదొలిగారు. ఈ జాబితాలో చెన్నై సూపర్ కింగ్స్ ఆటగాడు నాథన్ ఎల్లిస్, రాజస్థాన్ రాయల్స్ నుంచి సామ్ కర్రన్ ఉన్నారు. పంజాబ్ కింగ్స్ కొనుగోలు చేసిన లాకీ ఫెర్గూసన్ సైతం కుటుంబ పరిస్థితుల నేపథ్యంలో ఈ సీజన్‌కు దురమయ్యాడు. పోటీ నుంచి ఎల్లిస్ నిష్క్రమణను సీఎస్కే సీఈఓ కాశీ విశ్వనాథన్ ఇప్పటికే ధృవీకరించారు. అతని స్థానంలో మరొకరి కోసం ఫ్రాంచైజీ ప్రస్తుతం అన్వేషిస్తోందని పేర్కొన్నారు. ఒట్నీల్ బార్ట్‌మన్ పాకిస్థాన్ సూపర్ లీగ్ ఒప్పందం నుంచి వైదొలగడానికి సిద్ధంగా ఉన్నట్లు వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. అతడిని తీసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు సన్‌రైజర్స్ హైదరాబాద్, రాజస్థాన్ రాయల్స్ ప్రస్తుతం ఒక విదేశీ ఆల్ రౌండర్ కోసం అన్వేషిస్తున్నాయి. హైదరాబాద్ ఓ విదేశీ పేసర్‌ను తీసుకుంటుందనే వార్తలు వస్తున్నాయి.



# పాక్ బోర్డుపై గ్యారీ కిర్‌స్టన్ సంచలన వ్యాఖ్యలు

ప్రపంచ క్రికెట్‌లో ఒకప్పుడు టాప్ జట్లతో ఒకటిగా వెలిగిన పాకిస్థాన్ క్రికెట్ ప్రస్తుతం అత్యంత గందరగోళ పరిస్థితిలో ఉంది. కేవలం ఆటగాళ్ల ప్రదర్శన మాత్రమే కాదు, తెరవెనుక బోర్డు వ్యవహారశైలి కూడా ఆ జట్టును పతనం దిశగా నడిపిస్తోంది. ఇటీవల ఆ జట్టు మాజీ వైట్ బాల్ కోచ్ గ్యారీ కిర్‌స్టన్ చేసిన వ్యాఖ్యలు క్రికెట్ ప్రపంచంలో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. పాక్ క్రికెట్ బోర్డులో ఉన్న 'టాక్సిక్' వర్క్ కల్చర్ గురించి ఆయన బయటపెట్టిన నిజాలు వింటే, అంతర్జాతీయ స్థాయిలో ఒక బోర్డు ఇంత బాధ్యతారాహిత్యంగా ఎలా ఉంటుందో అర్థమవుతుంది. శ్రీలంక హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో గ్యారీ కిర్‌స్టన్ పాక్ బోర్డుపై విమర్శల వర్షం కురిపించారు. బోర్డు అధికారుల జోక్యం తాను గతంలో ఎన్నడూ చూడని స్థాయిలో ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. డ్రెస్సింగ్ రూమ్ వెలుపల నుంచి వచ్చే అనవసరపు ఒత్తిడి, మర్యాద లేకపోవడం వల్ల ఆటగాళ్లతో కలిసి ఒక వ్యూహాన్ని రూపొందించడం కోచ్‌లకు అసాధ్యంగా మారిందని ఆయన పేర్కొన్నారు. కేవలం ఆరు నెలల కాలంలోనే తనకు ఎదురైన చేదు అనుభవాలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు.జట్టు ఏదైనా మ్యాచ్ ఓడిపోతే వెంటనే కోచ్‌లపై ఆంక్షలు విధించడం లేదా వారిని తొలగించడం పీసీబీకి పరిపాటిగా మారిందని కిర్‌స్టన్ విమర్శించారు. పరిపాలన పరమైన లోపాలను కప్పిపుచ్చుకోవడానికి కోచ్‌లను బలిపశువులను చేయడం వల్ల ఎటువంటి ప్రయోజనం ఉండదని ఆయన అభిప్రాయపడ్డారు. జట్టు ఆటతీరు సరిగ్గా లేనప్పుడు మద్దతు ఇవ్వాల్సింది పోయి, కోచ్‌ల అధికారాన్ని తగ్గించడం అనేది వినాశకరమని హెచ్చరించారు. కోచ్‌లకు స్వేచ్ఛ ఇవ్వనప్పుడు అసలు వారిని ఎందుకు నియమించుకుంటారని సూటిగా ప్రశ్నించారు. 2024 టీ20 వరల్డ్ కప్ నుంచి పాకిస్థాన్ నిష్క్రమించిన తర్వాత బోర్డుకు, కోచ్‌కు మధ్య దూరం పెరిగింది. ఆటగాళ్ల ఫిట్‌నెస్, మానసిక దృఢత్వాన్ని పెంచేందుకు కిర్‌స్టన్ చేసిన ప్రయత్నాలకు బోర్డు నుంచి సహకారం లభించలేదు. దీనికి తోడు సెలక్షన్ కమిటీలో హెడ్ కోచ్‌కు ఉన్న ఓటు హక్కును పీసీబీ తొలగించడం అసలు సమస్యకు దారి తీసింది. ఆస్ట్రేలియా పర్యటనకు జట్టును ఎంపిక చేయడంలో గానీ, మహమ్మద్ రిజ్వాన్‌ను కెప్టెన్ గా నియమించడంలో గానీ కిర్‌స్టన్ ప్రమేయం లేకుండానే నిర్ణయాలు జరిగిపోయాయి. దీంతో తన గౌరవాన్ని కాపాడుకోవడానికి ఆయన పదవి నుంచి తప్పుకున్నారు. కేవలం కిర్‌స్టన్ మాత్రమే కాదు, ఆస్ట్రేలియా దిగ్గజం జేసన్ గిల్లెస్పీ కూడా ఇలాంటి పరిస్థితులే ఎదుర్కొన్నారు. ఇంగ్లాండ్‌పై చారిత్రాత్మక టెస్ట్ సిరీస్ విజయం అందించినప్పటికీ, గిల్లెస్పీని బోర్డు పక్కన పెట్టింది. కనీసం ఆయనకు సమాచారం ఇవ్వకుండానే హై పెర్ఫార్మెన్స్ కోచ్ టిమ్ నీల్సన్‌ను పీసీబీ తొలగించింది. ఇది గిల్లెస్పీని తీవ్రంగా



అవమానించడమేనని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇలాంటి రాజకీయాలు ఉన్న చోట ఎంతటి గొప్ప కోచ్ వచ్చినా విజయం సాధించడం అసాధ్యమని కిర్‌స్టన్ వ్యాఖ్యానించారు. భారత్‌తో జరిగిన మ్యాచ్‌లలో ఓడిపోయిన తర్వాత, పాక్ జట్టులో కనీస ఐక్యత లేదని కిర్‌స్టన్ ఆటగాళ్లకు మొహం మీదే చెప్పినట్లు వార్తలు వచ్చాయి. బోర్డులో ఉన్న వర్గపోరు డ్రెస్సింగ్ రూమ్ మీద కూడా ప్రభావం చూపిస్తోందని ఆయన గ్రహించారు. ఆటగాళ్లు ఒకరిపై ఒకరు నమ్మకం కోల్పోవడం, బోర్డు సభ్యుల రాజకీయాలు జట్టు ప్రదర్శనను దెబ్బతీస్తున్నాయని ఆయన స్పష్టం చేశారు. లాహోర్‌లోని బోర్డు కార్యాలయం నుంచి వచ్చే నిర్ణయాలు క్రికెట్ ప్రయోజనాల కంటే రాజకీయ ప్రయోజనాలకే ఎక్కువగా ఉన్నాయని అన్నారు. పాకిస్థాన్ క్రికెట్ బోర్డు తన పంథాను మార్చుకోకపోతే రాబోయే రోజుల్లో ఆ జట్టు మరింతగా దిగజారిపోయే ప్రమాదం ఉంది. మోహ్సిన్ నఖ్వీ నేతృత్వంలోని బోర్డు ప్రొఫెషనల్స్ కు ఇచ్చే గౌరవం ఏంటో కిర్‌స్టన్, గిల్లెస్పీ ఉదంతాలు నిరూపించాయి. కిర్‌స్టన్ చేసిన కామెంట్స్ మళ్ళీ చర్చనీయాంశంగా మారాయి. ఇప్పటికే నష్టాల్లో ఉన్న పాకిస్థాన్ క్రికెట్ బోర్డు తరచుగా భారతదేశంపై ఏదో ఒక రకంగా విషం చిమ్ముతూనే ఉంటుంది. అయితే గురువులకు కనీసం గౌరవం ఇవ్వకుండా ఉండడంతో తీవ్ర స్థాయిలో విమర్శలు వస్తున్నాయి. మరి కిర్‌స్టన్ కామెంట్స్ విషయంలో పాకిస్థాన్ క్రికెట్ బోర్డు రియాక్షన్ ఎలా ఉంటుందో చూడాలి.



సమగ్ర తెలుగు దినపత్రిక
అడుగు
The Step Towords The Truth..



# నితిన్ మళ్లీ గాడిలో పడేనా?

టాలీవుడ్ హీరో నితిన్ ఒకప్పుడు వరుస విజయాలతో మంచి ఫామ్‌లో ఉన్న ఆయన, గత కొన్నేళ్లుగా బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో మెప్పించలేకపోయారు. 'చెక్', 'రంగ్ దే', 'మ్యాస్ట్రో', 'మాచర్ల నియోజకవర్గం', 'ఎక్స్‌ట్రా ఆర్డినరీ మ్యాన్' వంటి చిత్రాలు ప్రేక్షకులను నిరాశపరచగా, గతేడాది విడుదలైన 'తమ్ముడు', 'రాబిన్‌హుడ్' సినిమాలు కూడా డిజాస్టర్లుగా మారి ఆయన మార్కెట్‌పై ప్రభావం చూపాయి. ఈ పరిస్థితుల్లో రూట్ మార్చిన నితిన్, కథల ఎంపికలో జాగ్రత్తలు తీసుకుంటూ సక్సెస్ ట్రాక్‌లోకి తిరిగి రావడానికి ప్లాన్ చేస్తున్నారు. ప్రస్తుతం ఆయన టాలెంటెడ్ డైరెక్టర్ విఐ ఆనంద్ దర్శకత్వంలో ఒక భారీ సైన్స్ ఫిక్షన్ చిత్రంలో నటిస్తున్నారు. విభిన్న కాన్సెప్ట్‌లతో సినిమాలు తెరకెక్కించే ఆనంద్, నితిన్ కోసం ఒక కొత్త తరహా కథను సిద్ధం చేయడంతో ఈ ప్రాజెక్ట్‌పై మంచి ఆసక్తి నెలకొంది. ఇంతలోనే నితిన్ మరో రెండు క్రేజీ ప్రాజెక్టులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చి అందరినీ ఆశ్చర్యపరిచారు. అందులో ఒకటి 'ఆయ్' సినిమాతో బ్లాక్‌బస్టర్ అందుకున్న దర్శకుడు అంజి చెప్పిన కథ. ఈ చిత్రాన్ని నితిన్ తన సొంత నిర్మాణ సంస్థ శ్రేష్ట్ మూవీస్ బ్యానర్‌పై నిర్మించనున్నారు. జూలై నుంచి షూటింగ్ ప్రారంభించి, వచ్చే ఏడాది సంక్రాంతికి విడుదల చేయాలని ఎ÷–లాన్ చేస్తున్నారు. ఇదే కాకుండా, మరో ప్రముఖ నిర్మాణ సంస్థలో ఒక కొత్త దర్శకుడితో సినిమా చేయడానికి కూడా నితిన్ సిద్ధమవుతున్నారని సమాచారం. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన అధికారిక ప్రకటన వచ్చే నెలలో వెలువడే అవకాశం ఉంది.రెగ్యులర్ కమర్షియల్ ఫార్మాట్‌కు భిన్నంగా, కొత్త తరహా కథలతో ప్రేక్షకులను ఆకట్టుకోవాలని ప్రయత్నిస్తున్నారు.

# శంబాల దర్శకుడితో సందీప్ కిషన్ మూవీ

యువ కథానాయకుడు సందీప్ కిషన్ తన కెరీర్‌లో మరో మైలురాయి




లాంటి ప్రాజెక్ట్‌కు శ్రీకారం చుట్టారు. ఇటీవలే 'శంబాల' చిత్రంతో సూపర్ హిట్ అందుకుని ఇండస్ట్రీ దృష్టిని ఆకర్షించిన దర్శకుడు యుగంధర్ ముని ఇప్పుడు అదే స్థాయి భారీ కాన్సెప్ట్‌తో సందీప్ కిషన్‌ను వెండితెరపై ఆవిష్కరించబోతున్నారు. షైనింగ్ పిక్చర్స్ బ్యానర్‌పై ప్రొడక్షన్ నంబర్ 3గా రూపొందుతున్న ఈ చిత్రం ఒక హై-వోల్టేజ్ ఫాంటసీ అడ్వెంచర్‌గా ప్రేక్షకులను అలరించనుంది.
కొన్ని యుద్ధాలు ముగియవు..
కొంతమంది రాజులు మరణించరు అనే పవర్‌ఫుల్ మరియు ఇంట్రెస్టింగ్ ట్యాగ్‌లైన్‌తో విడుదలైన అనౌన్స్‌మెంట్ పోస్టర్ చూస్తుంటే, ఇది ఒక గొప్ప చారిత్రక లేదా పురాణ సంబంధిత నేపథ్యం ఉన్న ఎపిక్ సాగా అని స్పష్టమవుతోంది. రాజశేఖర్ అన్నభిమోజు మరియు మహిధర్ రెడ్డి సంయుక్తంగా అత్యున్నత నిర్మాణ విలువలతో, భారీ బ్జడెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సందీప్ కిషన్ కెరీర్‌లో 33వ చిత్రంగా రాబోతున్న ఈ ప్రాజెక్ట్, ఆయన మునుపటి సినిమాల కంటే భిన్నమైన మేకోవర్‌లో ఉండబోతోందని సమాచారం. విజువల్ వండర్‌గా తీర్చిదిద్దనున్న ఈ చిత్రాన్ని తెలుగుతో పాటు హిందీ, తమిళ భాషల్లో ఏకకాలంలో విడుదల చేసేందుకు చిత్ర బృందం సన్నద్ధమవుతోంది. వైవిధ్యమైన కథలను ఎంచుకోవడంలో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న సందీప్ కిషన్, ఈ ఎపిక్ సాగాతో పాన్ ఇండియా స్థాయిలో తన మార్కెట్‌ను విస్తరించుకోనున్నారు.

# నాలుగు గంటల సినిమా..దమ్ముండాల్సిందే

## దురంధర్ -2 మూవీ అద్భుతం అన్న రాజమౌళి

రణవీర్ సింగ్ ప్రధాన పాత్రలో దర్శకుడు ఆదిత్య ధార్ తెరకెక్కించిన 'ధురంధర్ 2: ద రివెంజ్' చిత్రంపై టాలీవుడ్ దిగ్గజ దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి ప్రశంసల వర్షం కురిపించారు. తాజాగా ఈ సినిమా చూసిన జక్కన్న ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టాడు. నాలుగు గంటల సినిమా తీయాలంటే దమ్ముండాలని పేర్కొన్నారు. ఈ చిత్రం మొదటి భాగం కంటే స్కేల్ మరియు ఎమోషన్ పరంగా అద్భుతంగా ఉందని, తనకు 'ధురంధర్ 1' అంటే చాలా ఇష్టమని కానీ సీక్వెల్ దానిని మించిపోయిందని ఆయన సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు. ముఖ్యంగా 4 గంటల సుదీర్ఘ నిడివి ఉన్నప్పటికీ, ప్రేక్షకులను సీటు నుంచి కదలకుండా చేయడంలో దర్శకుడు ఆదిత్య ధార్ విజయం సాధించారని, ఇది ఒక గొప్ప సాహసమని రాజమౌళి




కొనియాడారు. రణవీర్ సింగ్ నటనను ప్రస్తావిస్తూ, షెడ్ లో చెల్లెలితో వచ్చే సన్నివేశం ఒక 'మాస్టర్‌క్లాస్ ఇన్ యాక్టింగ్' అని, హమ్జా మరియు జస్కీరత్ పాత్రల్లో ఆయన మెస్మరైజ్ చేశారని అభినందించారు. అలాగే ఆర్. మాధవన్ దేశం నిస్సహాయతను తన నటనతో అద్భుతంగా పండించారని రాజమౌళి ప్రశంసించారు.సినిమాలోని రైటింగ్, మ్యూజిక్, వరల్డ్ డిజైన్ వంటి సాంకేతిక అంశాలు కూడా అద్భుతంగా కుదిరాయని ఆయన వెల్లడించారు. మరోవైపు ఈ భారీ యాక్షన్ డ్రామా బాక్సాఫీస్ వద్ద కూడా సునామీ సృష్టిస్తోంది, కేవలం రెండు రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ. 350 కోట్లకు పైగా వసూళ్లు సాధించి రికార్డులు తిరగరాస్తోంది.

# ఎఎ23పై భారీ అంచాలు

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ లీడ్ రోల్‌లో, కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో రూపొందనున్న భారీ ప్రాజెక్ట్ 'ఎఎ23'పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. అధికారిక ప్రకటన వచ్చినప్పటి నుంచే ఈ సినిమా ఇండియన్ సినీవర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ ప్రాజెక్ట్‌కు మ్యూజిక్ సెన్సేషన్ అనిరుధ్ రవిచందర్ సంగీతం అందించనుండగా, సంక్రాంతి సందర్భంగా విడుదల చేసిన స్పెషల్ వీడియోతో సినిమాపై హైప్ మరింత పెరిగింది. భారీ బ్జడెట్‌తో రూపొందుతున్న ఈ చిత్రాన్ని మైత్రి మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్నారు. బన్నీ వాస్‌తో పాటు నట్టి, శాండీ, స్వాతి సహ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. ఇక ఈ సినిమా క్యాస్టింగ్ విషయంలో ప్రస్తుతం పలు ఆసక్తికర వార్తలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే బాలీవుడ్ హీరోయిన్ శ్రద్ధా కపూర్ పేరు ÷నైల్ అయిందని ప్రచారం జరుగుతుండగా, తాజాగా మరో స్టార్ హీరోయిన్ పేరు తెరపైకి వచ్చింది. బాలీవుడ్ నటి అనుష్క శర్మ కూడా ఈ ప్రాజెక్ట్‌లో కీలక పాత్రలో



కనిపించే అవకాశాలు ఉన్నట్లు టాక్ వినిపిస్తోంది. అయితే ఈ విషయంపై చిత్రబృందం నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. దీంతో ఈ వార్తలు పుకార్లుగానే ఉన్నప్పటికీ, అభిమానుల్లో మాత్రం ఆసక్తి పెరుగుతోంది. ఒకవేళ ఈ కాంబినేషన్ నిజమైతే, ఇది పాన్ ఇండియా స్థాయిలో మరింత క్రేజ్ తెచ్చే ప్రాజెక్ట్ అవుతుందని సినీ వర్గాలు భావిస్తున్నాయి.

Printed, Published & Owned by Margam Rama on behalf of ADUGU DIGITAL MEDIA Pvt. Ltd, Printed and Published at ADUGU PRESS, H No: 7-120, PALAKURTHI Village & Mandal, Jangaon District, Telangana, PIN: 506146. Chief Editor: Dr.Margam Lakshmi Narayana, Ph.No. : 8499990005